



మెడికల్ షాపుకోసం గుంటూరు మెయిన్ బజార్లో సీతారాముడి అడుగులు పడుతున్నై. మెదడు వెంకటాపురంవైపు మళ్ళింది. ఆ ఊరికి కరెంటు రావటం మళ్ళీ స్ఫురించింది. మళ్లీ భరించలేని ఊదర పుట్టింది. బలవంతంగా మనసు తిప్పుకుంటే, గుంటూరు తాలూకు పరిసరాలు తన జ్ఞానేంద్రియా లన్నిటినీపట్టి పిసికేస్తున్నట్టు కనిపించినై. వినిపించినై. వాసనకొట్టినై.

సీతారాముడికి బస్తీలంటే రోత. గుంటూరంటే మరింతరోత. ఇప్పుడు మరీరోత.

వెంకటాపురానికి కరెంటు రావాలని తను తపించిపోయాడు. ఎనిమిదెకరాల గరువులో బోరు వేసి బంగారం పండించాలని కలలుగన్నాడు. సిరిదేవత చిందించిన చిరునవ్వులాగా కరెంటు వచ్చింది. పల్లం ఎకరం అమ్మిన బాపతు డబ్బు సిద్ధం అయింది. కానీ– ముసలాయన అడ్డం పడ్డాడు. శనిదేవత తన నీరూపంలో కాళ్ళూ, చేతులూ బిగించికట్టి ఈ దరిద్రగొట్టు గుంటూరులో కుదేసింది.

చీదరగా "థూ!" అనుకున్నాడు సీతారాముడు. అనుకుని ఆలోచనలన్నీ దులిపేసుకుని షాపు లన్నిటినీ పరీక్షగా చూశాడు. మెడికల్‌షాపు కనిపించింది. కనిపించిన మరుక్షణం అదంటే అసహ్యంవేసింది. తనకే కాదు. ఈ గుంటూరులో ఏది కనిపించినా అలాగే ఉంది. పట్టరాని చీదర పుడుతోంది. కానీ తప్పదు. సీతారాముడు లోపలికి వెళ్ళాడు.

మందులు బల్లమీద పెట్టి, అంకెలు కూడి "యాభై ఎనిమిదీ తొంభై!" అన్నాడు షాపువాడు. ఒక్కమాటు సీతారాముడికి ఆపాదమస్తకం ఉడకబెట్టేసినట్లయింది. ఈ మందుల్నీ మందులషాపుల్నీ, షాపువాళ్ళనీ, డాక్టర్లనీ, ఆస్పత్రుల్నీ, బస్తీల్నీ కట్టగట్టి ముక్కలుముక్కలుగా, నుసినుసిగా సర్వనాశనం చెయ్యాలన్నంత మంటమండింది. దిగమింగి, దబ్బిచ్చి, ఉక్రోషంగా బయటకు వచ్చాడు.

ఎందుకు? ఈ ఆస్పత్రులు, స్పెషల్‌వార్డులు పెద్ద డాక్టర్లు, కొత్తమందులు - ఇవన్నీ ఎందుకు? పల్లం అమ్మిన డబ్బు ఇల్లా ఎందుకు ఆవిరి కావాలి? తన ఆశలన్నీ ఎందుకు నాశనం కావాలి? చేత కందిన సిరి ఎందుకు దూరం కావాలి?

డెభ్భై ఏళ్ళ మనిషి. ఇంకెంత కాలం బతుకుతాడు? ఈ ఆస్పత్రులన్నీ ఈ మనిషిని ఎంత కాలం నిలబెడతై? నిలబడి ఈ మనిషి ఉద్ధరించేదేమిటి?

లేను. ఇదంతా వెర్రి. ఈ డాక్టర్లు, ఇంకా పెద్ద డాక్టర్లు. కొత్త వైద్యాలు ఇంకా కొత్త వైద్యాలు– ఇదంతా వట్టి వెర్రి. ఈ వెర్రిలోనూ కొట్టుకుపోతున్నాడు. అర్థం లేని విషయానికి తెలిసి తెలిసి తన ఆశలన్నీ బలిచేసుకుంటున్నాడు.


"ఇంకా నయం. ఆ గుండె మార్పటాల్లాంటివి గుంటూరు దాకా రాలేదు–" సీతారాముడు అదోక మాదిరిగా నవ్వుకున్నాడు.

\+ \+ \+

ఆస్పత్రి గది తెరుచుకుని లోపలికి వస్తుంటే తల్లి ముఖం కనిపించి సీతారాముడు కళ్ళు దించుకున్నాడు. ఆమెవైపు సూటిగా చూడలేకపోయాడు.

"ఇప్పుడే పడుకున్నారు!" అంది లక్ష్మమ్మ మెల్లగా. అనటంలో పెద్దబరువు దిగిన సంతృప్తి వ్యక్తం అవుతోంది.

"ఉహూఁ!" అని బలవంతంగా ఊకొట్టాడు సీతారాముడు. ఆ సంతృప్తి పంచుకొనటానికి తనకి సిగ్గుగా ఉంది. పంచుకోవాలని అతి ప్రయత్నం మీద తండ్రివైపు చూశాడు.



తండ్రి కళ్ళు మూసుకుని పడుకున్నాడు. సీతారాముడికి ఆ ప్రశాంతత చూస్తున్నప్పుడు– ఇంతవరకు తన మనసు నీచంగా ఆలోచించలేదూ? అనిపించింది.

"ఈ మందులు ఎల్లా వాడాలి?" కొడుకు చేతిలోని మందులు అందుకుంటూ అడిగింది లక్ష్మమ్మ.

"సాయంత్రం వచ్చినప్పుడు చెబుతానన్నారు డాక్టరు గారు" అన్నాడు సీతారాముడు ఆలోచననుంచి తేరుకుంటూ.

"నీళ్ళు పోసుకో. అన్నం తిందువుగాని." అంది లక్ష్మమ్మ తువ్వాలు తీస్తూ. సీతారాముడు నీళ్ళగదిలోకి వెళ్ళాడు.

స్నానం చేసి బయటికి వస్తుంటే "ఏవో అంటున్నారు చూడు:" అంది లక్ష్మమ్మ— ఆ అంటున్న విషయం పట్ల విసుగ్గా. సీతారాముడు ఆత్రంగా తండ్రి దగ్గరకు వెళ్ళాడు.

"కూర్చో!" అనబోయి. ఓపిక చాలక చేతితో సౌంజ్ఞ చేశాడు రాఘవయ్య. సీతారాముడు కూర్చుని శ్రద్ధగా ముందుకు వంగాడు.

ఓపికంతా కూడదీసుకుంటూ "నాకు...జబ్బు తగ్గిపోయింది." అన్నాడు రాఘవయ్య. సీతారాముడు ఏదో అనేలోగా, "పోదాం... మన...ఊరు..." అన్నాడు. సీతారాముడు ఆశ్చర్యంగా తండ్రివైపు చూశాడు. "ఈ ఆస్పత్రి...ఈ ఖర్చు...వద్దు .."

సీతారాముడి ఒళ్ళు ఝల్లుమంది. "ఖర్చేముంది నాన్నా !"– అప్రయత్నంగా తండ్రిని మెల్లగా మందలించాడు.

"ప్రాణం బాగుండనప్పుడు ఖర్చుని మానుకుంటారా ఏమిటి ? అర్థం లేని ధోరణి !"– చుర చుర చూస్తున్న లక్ష్మమ్మ కచ్చగా అంది.

రాఘవయ్య భార్యవైపు రివ్వున చూశాడు. "పిచ్చిముండా ! కాటికి కాళ్ళు చాచిన వాణ్ణి నాకు మందులేమిటే ?" అన్న అరుపులా చూశాడు, ఆ చూపు లక్ష్మమ్మ కనిపించిన మరుక్షణం చల్లబడిపోయింది, తను కాటికి కాళ్ళు జాచటం ఆమెకి ఎంతటి శిక్షో ఆమె ముఖంలో కనిపిస్తోంది. "మీ ఇష్టం !" అన్నట్లు విరక్తిగా చూపు తిప్పుకున్నాడు. హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినట్లు, లక్ష్మమ్మ వైపు తిరిగి "వాడికి... అన్నం చూడు" అన్నాడు నీరసంగా.

"నేను పెట్టుకుంటాలే. నువ్వు నాన్నగారి దగ్గర కూర్చో అమ్మా !" అంటూ మెల్లగా లేచాడు సీతారాముడు. లక్ష్మమ్మ భర్త కాళ్ళు నొక్కుతూ ఎత్తు పీట మీద కూర్చుంది.

అన్నం కలుపుకుంటున్న సీతారాముడికి ఆశ్చర్యంగా ఉంది. "ఖర్చేముంది నాన్నా !" అని ఎంత నిర్లక్ష్యంగా అన్నాడు ! అంటున్నప్పుడు– తండ్రి ఖర్చు గురించి ఆలోచించకూడదన్న ఆత్రం తప్పించి మరో విషయమే పట్టలేదు. తన తండ్రిని చూస్తుంటే కరెంటు, బోరు, గరువు– ఇవన్నీ మర్చిపోతున్నాడు. ఖర్చవుతోందన్న సంగతే మర్చిపోతున్నాడు. ఎందుకు? ఎందుకు మర్చిపోతున్నాడు !

సీతారాముడు నొసలు చిట్లించుకున్నాడు.

ఆ రోజు తను బోరు వెయ్యాల్సిన చోటు నిర్ణయించుకోవటానికి గరప చేనుకి వెళ్ళాడు. వెళ్ళిన కాసేపటికి పాలేరు రొప్పుకుంటూ వచ్చాడు. "నాన్నగారికి డోకులు. వైద్యుడు మిమ్మల్ని వెంటనే రమ్మన్నాడు– అంటుంటే ఒళ్ళు ఝల్లుమంది.

ఆ పైన ఆ బోరూ, ఆ మనుషుల ధ్యాసే పోయింది. ఉన్నవాడు ఉన్నట్లు హడావుడిగా బయలుదేరాడు. దోవలో ఒకటే ఆందోళన. నిన్న రోజంతా వికారంగా ఉందని ఆయన వచ్చి

## ప్రగతి

గంగ ముట్టలేదు. మగతగా పడి ఉన్నాడు. కడుపులో పసరు అనుకున్నారు. పొద్దున తను చేనుకి రాబోతుంటే ఆయన వాంతి చేసుకున్నాడు. వైద్యుడిని పిలిపించి తను ఇటు వచ్చాడు. ఇంతలో ఏమయింది? ఏమయింది?

ఉరకలు పెడుతున్నట్లు తను ఇంటికి చేరాడు. పలకరించటానికి పోగైన ఇరుగు పొరుగు వాళ్ళని చూస్తుంటే తనకి మరింత గాభరా వేసింది. అందర్నీ తప్పుకుని తిన్నగా తండ్రి దగ్గరకు వెళ్ళాడు. ఆయన మంచంలో నీరసంగా తెలివిలేనట్లు పడి ఉన్నాడు. "నాన్నా!" అని ఆత్రంగా పిలిచాడు. ఆయన కళ్ళు ఎంతో ప్రయత్నం మీద తెరుచుకుని క్లుప్తంగా చూసి వెంటనే మూతబడ్డై.

తన కళ్ళలో నీరు తిరిగింది.

ప్రతిరోజూ తను పొలంనుంచివచ్చి కనిపిస్తే దాలు ఏదో ఒక చిన్న విషయం పట్టుకుని. ఏమీ తెలియని చవటకి చెప్పినట్లు నీతులు చెప్పేవాడు. చివాట్లు పెట్టేవాడు. ఆ చాదస్తపు వాగుడుతో తనకి పట్టరాని చిరాకు పుట్టేది. ఎందుకో ఆ రోజు ఆ మనిషి మగతలోకి జారిపోతుంటే ఆ వాగుడులేని వెలితి దుఃఖం తెప్పించింది.

"పెద్ద వయసు. ధారకం లేకుండా ఈ వాంతులు. ఇంగ్లీషు డాక్టరెవరికైనా చూపించటం మంచిది" అన్నాడు వైద్యుడు.

వెంటనే తల్లితోపాటు బండిమీద పక్కబస్తీకి బయల్దేరాడు. మెదడులో తేమ జేరిందనీ, వెంటనే గుంటూరు తీసుకెళ్ళమనీ చెప్పినప్పుడు తను క్షణం ఆగలేదు. అటునుంచి అటే గుంటూరు తీసుకువచ్చాడు.

ఇప్పటికి వెన్నెముకలోనుంచి రెండుసార్లు నీరు లాగేశారు. వ్యాధి అట్లా నిలబడుతోంది. డబ్బు మాత్రం నీళ్ళలా ఖర్చవుతోంది.

డెభ్భై ఏళ్ళ మనిషని తెలుసు. ఎంతోకాలం బతకడని తెలుసు. బతికినా ప్రయోజనం ఏమీ లేదనీ తెలుసు. అయినా తను డబ్బు ఖర్చుచేసేస్తున్నాడు. బోరువేస్తే గరువులో బంగారం పండుతుందని తెలిసి తెలిసి, మృత్యువునోట పడి తీరవలసిన ఈ మనిషికోసం వృథా చేస్తున్నాడు.

"ఎందుకిలా చేస్తున్నాను! ఎందుకు? ఎం..." మజ్జిగ కలుపుకుంటున్న సీతారాముడు ఆదిరిపడ్డాడు. ఆ అదిరిపాటుకి కంచం దూరంగా జరిగింది. తనకి తెలియకుండానే వణికిపోతూ నిలబడ్డాడు.

ఆసత్రి దద్దరిల్లేటట్లు పెద్ద మూలుగు, వాంతి, లక్ష్మమ్మ ఆదుర్దాగా రాఘవయ్య చెవులు పట్టుకుని గుండెలు నిమురుతోంది. రాఘవయ్య స్పృహలేకుండా మంచంమీద వాలిపోయాడు.

ఆ వాలిపోయిన మనిషిలో మరోవాంతి చేసుకునేటప్పుడు తప్పించి చలనంలేదు. ఆ సాయంత్రానికి ఆయన పరిస్థితి మళ్ళీ మొదటికి దిగజారిపోయినట్లు తెలిసింది.

"ఛీ! ఎందుకు ఈయన బతకటం?" అనుకున్నాడు సీతారాముడు విసుగ్గా.

* * *

అయినా—

ఆ సాయంత్రం రాఘవయ్యకి వెన్నెముకలోనుంచి నీరు మళ్ళీ లాగేశారు. ఏవో ఇంజక్షన్లు చేశారు. ఆక్సిజన్ సిలిండరు, స్టాండు మళ్ళీ వచ్చినై రబ్బరుగొట్టాలు మళ్ళీ ముక్కుకి తగిలించారు. డాక్టర్లు వెళ్ళిపోయారు. నర్సు మధ్య మధ్య ప్రత్యేకంగా చూసిపోతోంది.

ఆ గదిలో బల్బు మళ్ళీ మకమకలాడుతోంది. దైన్యం తాండవం చేస్తోంది. తండ్రికి స్పృహ లేదు. రొమ్ము నీరసంగా పైకి, కిందకీ ఊగుతోంది. దిగులు చంపుకుని తల్లి దేవుణ్ణి ప్రార్థిస్తోంది.

అన్నిటికన్నా ముఖ్యంగా తనకి మళ్ళీ భయం వేస్తోందని సీతారాముడికి తెలిసింది. తెలిసిన మరుక్షణం తనమీద తనకే పట్టరాని చిరాకు వేసింది.

"ఎందుకు ఈ భయం? ఈ మనిషి ప్రాణం పోతే ఏమి ముంచుకుపోతుంది? ఉంటే ఏమి జరుగుతుంది?"

మరుక్షణం సీతారాముడూ, లక్ష్మమ్మ ఉలిక్కిపడ్డారు. పైకిలేచి దిగుతున్న రాఘవయ్య రొమ్ము క్షణంసేపు ఆగిపోయింది. ప్రాణం పోగవుతున్నట్లు అతి ప్రయాసపడుతున్నట్లు ముఖం మెలికలు తిరుగుతోంది. నోరు, దవడలు అయోమయంగా కదులుతున్నాయి. గుబగుబలాడుతున్న గుండెల్తో ఇద్దరూ రాఘవయ్యకి దగ్గరగావంగారు.

రాఘవయ్య గొంతులోనుంచి ధ్వని వచ్చింది. ఇద్దరూ ఒళ్ళంతా చెవులు చేసుకుని శ్రద్ధగా వింటున్నారు. "ఏమేవ్" అని పిలుస్తున్నాడు రాఘవయ్య "ఆ, అంది లక్ష్మమ్మ ఆత్రంగా. ఆపైన రాఘవయ్య మాటలు చాలా బాధగా వచ్చినయ్. "పొద్దు...నడి నెత్తి మీదికి...వచ్చిందే. వాడు చద్దన్నం తిని వెళ్ళాడ్టే?"

సీతారాముడి ఒళ్ళు ఝల్లుమంది "ఎందుకు? ఎందుకు?" అని తనని తొలిచేస్తున్న ప్రశ్నకి సమాధానం ముఖాన అదిమి చూపినట్లయింది. వెంటనే దుఃఖం వరదలా పొంగింది.

బోరు బావి గరువులో బంగారం కురిపించవచ్చు. సిరిచేత చిందులు తొక్కించవచ్చు. కానీ తన క్షేమంకోసం, శ్రేయస్సుకోసం ఈ స్థితిలో కూడా పరితపించేది ఈ ప్రాణం ఒక్కటే. వదులుకుంటే తిరిగి దక్కదు. ●



రాణీ: నువ్వు అర్థ నగ్నంగా దుస్తులు ధరిస్తుంటే ప్రజలు నన్ను లోభి అనుకుంటున్నారు.